కథా నిలయం
1471
శ్రీకాకుళం

# ప్రేమకథ

సదానందం ప్రేమగోల చూస్తుంటే ఓకథ రాయాలనిపించింది. ఓ అర్థరాత్రి సమయంలో కూర్చుని కథ వ్రాయటం మొదలుపెట్టాను.

సదానందం ఒక కథా నాయకుడు– వాడి వదనం, అలనాడు అశోకవృక్షం క్రింద కూర్చున్న సీతమ్మవారి ముఖారవిందంలా వుంటుంది. అంటే... నా వుద్దేశ్యం సార్థక నామధేయుడు కాదూ... అని.

'ఏరా నాన్నా!– నీ పేరు సదానందంగదా! ఎప్పుడూ ఏడుస్తూ వుంటావేంరా?' అంటే, అమాంతం ఆర్టిఫిషి

జూలై '67 కృష్ణాపత్రికలో ప్రచురితము

యల్గ బిగబట్టి చిరునవ్వు నవ్వేసి మళ్ళీ యథాతథంగ ముఖాబ్జాన్ని ముకుళింపచేసేవాడు.

'ఆనందం, నీపేరులోనే నిత్యం, ఆనందం పుట్టిపడుతుందిగదా? మరి నీ ఖర్మ మిట్లా కాలిందేరా?' అన్నానోరోజున.

'పేరు మినహా, నాలో ప్రతిరక్తపు అణువూ విచారంతో పాయిజనయి పోయిందిరా!' అనేది వాడి సమాధానం.

'ఇంతకూ, నీకొచ్చిన కష్టమేమిట్రా తండ్రీ?' వాడి దీనాలాపన వినాలని కుతూహలపడుతూ అడిగేను మళ్ళీ.

'వక్కటనేమిట్రా బ్రదర్ ... వెధవది అడ్డమైనవాడూ ప్రేమించేవాడే! అసలు ప్రేమించటమనేది ఓ క్వాలిఫికేషనైంది. అందుక్కావలసిన చిట్కాయేదో నాక్కూడా చెబితే, నేనూ ఏడుద్దును.'

'హమ్మయ్య, మనసులో కోరిక యెన్నాళ్ళకు వెళ్ళగక్కావురా. అయితే ఏడవకు-ఎవడో, ఎవరినో ప్రేమిస్తున్నాడని ఏడిస్తే నీకు వరిగేదేమిటోయ్. చేతనైతే నువ్వూ ట్రై చెయ్ నీకూ లక్ తగలచ్చు' హితోపదేశం చేశాను.

'ఒరే చిదానందం ఈ సదానందానిక్కూడా ప్రేమోపదేశ మేదైనా చేయరాదూ? చచ్చి నీకడుపున పుడతాను. నువ్వు నాకు గురువన్నమాటేగాని ఛాన్సులన్నీ నీవే నాయె. నన్నూ ఓ ప్రేమికుడిగా తయారు చేయకూడదూ?'

'బ్రహ్మచారీ... నీ ముఖం, అస్తమానం అట్లా యెండాకాలపు మిట్టమధ్యాహ్నపు సూర్యుడిలాగ మటమట

లాడించపోతే, సంతోషంగ యేడవరాదూ? అసలు నిన్ను చూస్తుంటేనే, పదిమంది ఆడపిల్లలను కన్న తండ్రిలాగ అఘో రిస్తుందాయె నీ ముఖం. అలాంటి నిన్ను, ఏ ఆడది ప్రేమి స్తుందిరా.'

'అంత తేలిగ్గా మాట్లాడకోయ్. మచ్చుకో అమ్మా యిని నన్ను ప్రేమించమని రికమెండు చెయ్... తర్వాత నీకే తెలుస్తుంది మన తఢాకా!'

"అంటే... ?"

"అంటే! వీడసలే ట్రాజడీకింగ్ (అంటే ఏడుపు ముఖం వాడూ అని) అలాంటి వీడున్నాడు చూశావ్... తర్వాత ఏమైనా చేస్తాడు" అంటూ థర్డ్ పర్సన్‌లో తనను తాను గొప్పగా పొగుడుకున్నాడు.

"అది సరేగాని సదా-మొన్న నే చేయమని చెప్పిన ట్రయలేమైందిరా?!-"

"నా ముఖమైంది. నువ్వు చెప్పినట్టే ... మొదటి రోజున సుశీల వాకిట్లో నిలబడి జడ అల్లుకుంటుంటే కిల కిలా నవ్వేశాను—నిన్న ... సిటీబస్ స్టాపులో నిల్చున్నప్పుడు... కాలేజికి రావటం లేదనే నెపంతో పలుకరించి, బస్సుయెంతకీ రాకపోవటంతో రిక్షా మాట్లాడి పెట్టి పంపేను. ఇకపోతే ప్రొద్దున... నీ గైడెన్సు ప్రకారమే-తూ-చ-తప్పకుండా నువ్వు వ్రాసిచ్చిన లవ్ లెటర్ అగ్గిపెట్టెలో పెట్టి, డాబామీద పచార్లు చేస్తున్న సుశీల కాళ్ళముందు పడేట్టు విసిరేశాను..."

"అయితే సక్సెస్ అన్నమాట"

"ఆ...ఆ! చావు తప్పి కన్ను లొట్టబోయినంత పనైంది. వెంటనే వాళ్ళ గూర్ఖా వాడొచ్చి హిందీలో చడా మడా నోటికొచ్చినట్లల్లా తిట్టి వెళ్ళిపోయాడు."

"కథ విషాదాంతమైందన్నమాట..."

"అన్నమాటేమిటి?—వున్న మాటే అది!"

"చూడు సదా! కొంచెం ఓపికపట్టు. ఇలాంటి ప్రేమ వ్యవహారాల్లో తొందర పడితే ప్రమాదం. మనకు లైం వేస్టయినా పని సానుకూలం అయ్యేట్టు చూడాలి."

"ఏం చూస్తావో ఏమో?—ముందు వీపు చెడేట్టుంది"

'అప్పుడే అట్లా దిగజారిపోతే యెట్లారా?—అసలు రెండు మూడు చెడితేనేగాని డాక్టరన్పించుకోడు. అలాగే మనమూ!..."

"ఎందుకైనా మంచిది ఈసారి నావెంట నువ్వావుండు నీకున్న సమయస్ఫూర్తి నాకులేదు."

"చూడు సదా!- ప్రేమవ్యవహారాల్లో ప్రక్కనెవరైనా వుంటే...ప్రేమికజంటకు ఫలితం దక్కదు. సెల్ఫుహెల్పు మంచిదన్నారు. నువ్వే సాధించు-తీరా నీవెంట నేనుంటే... నిన్ను ప్రేమించబోయే అమ్మాయి కాస్తా...నాపాలయితే! తర్వాత నువ్వు బాధపడతావు- ఏమంటావ్?"

"అదీ నిజమే! నువ్వసలే...పంచబాణుడివి."

"అయితే విను! నువ్వు చేయబోయే కార్యక్రమం ఏమిటో తెల్సా?"

"నువ్వు చెప్పందే యెట్లా తెలుస్తుంది" అంటూ చెవులు రిక్కించాడు.

'ఈసారి నువ్వు చెయ్యబోయే క్రియలు... పౌరాణిక సినిమా సెట్టింగులాగ... భారీయెత్తున వుంటుంది. అయితే ఇంగ్లీషు సినీమాలో లాగా...ముందు సస్పెన్సు తర్వాత థ్రిల్ చివరకు క్లైమాక్సు. తెలిసిందా? అప్పుడుగాని నీ ప్రేమ వ్యవహారం రక్తి కట్టదు."

"నీ ప్రణాళిక బాగానేవుంది."

"అయితే అందుకు కావల్సిన కాపిటలంతా నీదే. కేవలం దర్శకత్వం మాత్రం నాది-ఎలావుంది మనప్లాన్ ?"

'ఇంతకూ...కథానాయి కెవరు ?'

'సుధ !'

'అబ్బా పేరు యెంత మధురంగ వుంది.'

'కథ అక్కడ నుండే ప్రారంభమౌతుంది— అయితే ఆ అమ్మాయితో మాట్లాడేప్పుడు కనీసం ఒక్క 'రీటేకై'నా వుండకుండా మాట్లాడాలి తెల్సిందా ?'

'అదిసరే చిదానందం...సుధ అంటే...పోలీసు ఇన్స్పెక్టర్ కరుణానిధిగారి అమ్మాయేనా ?'

'ఆఁ...కరెక్టు చూశావా? నీ బుర్ర యెంత చురుగ్గా పనిచేస్తున్నదో ?'

"బాబ్బాబు...పోయి పోయి పోలీసువారి అమ్మాయితో ప్రేమ వ్యవహారమేమిట్రా- ఖర్మ! నా జాతకంలో

శ్రీకృష్ణ జన్మస్థాన ప్రాప్తికూడా వుందిగామోసు" నిరుత్సాహ పడ్డాడు.

"అట్లా దిగజారి పోకుమరి- కాబోయే మీ మామ గారు, చేసే వుద్యోగం అలాంటి దన్నమాటేగాని ... పేరుకు దగ్గ వ్యక్తి. కరుణా సముద్రుడనుకో."

"సరేకాని-ఇదెందు కొచ్చిందో- అందుకే అంటారు ప్రేమా చేటును తేకేని..."

"చూడు సదా! నువ్వు ప్రతి దానికీ ఇట్లా దిగజారి పోయి అడ్డుపుల్ల వేస్తే... ఇక నీదారి నీది-నీ ప్రేమ ప్రయ త్నంలో యెలాంటి జోక్యమూ కల్గించుకోను. ఏదో శిష్యుడివి గదాని...నిన్నొక ఇంటివాడిని చేద్దామనుకుంటే...నన్నిట్లా నిరుత్సాహపరిస్తే, నేను మాత్రం ఇక యెలాంటి సలహాలూ ఇవ్వను, తర్వాత నీ యిష్టం."

"అంతకోపం దేనికిరా? నా భయం నాది-సరేకాని లవ్ యెఫైర్లో లాస్టు ట్రయల్ ఇదే..."

"ఆఁ...అయితే విను. రోజూలాగే సాయంత్రం బీచి కొస్తుంది సుధ. నువ్వూ తయారవ్వు-కావలిస్తే నా స్కూటరిస్తాను. చూడు సదా. సుధను కలిసినప్పటినుంచీ చిరునవ్వుతో వుండాలి. అంతేగాని...పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుతున్న వాడిలావుంటే...వ్యవహారం చెడుతుంది. ఆ తర్వాత ఏదో నెపంమీద పలకరించు-తర్వాత ఆ అమ్మాయే నిన్ను లీడు చేస్తుంది. సరేనా?"

"ఏమిటో...అంతా అగమ్యగోచరంగ వుంది."

"నువ్వు చేరాలనుకున్న గమ్యాన్ని సుధే చేరుస్తుంది. చాకులాంటి పిల్ల."

"సరే నీ ఇష్టం. ఆపైన అంతా దైవాధీనం."

◆ ◆ ◆

సూర్యాస్తమయం కావచ్చింది.

సముద్రుడు ఘీంకరిస్తున్నాడు. మేఘాలు ఆకాశాన్ని కౌగలించుకోవాలనే ఆపేక్షతో నలువైపులకు పరుగెడుతున్నాయి.

కెరటాలు ఒడ్డునవున్న పొడి ఇసుకను ముద్దెట్టుకోవాలనే ఆపేక్షతో నిముషానికోమారు ముందుకు పరుగెత్తుతున్నాయి.

ఒంటరిగ కూర్చున్న సుధను సమీపించాడు సదానందం. చిన్న సకిలింపు ధ్వనిచేసి ప్రక్కనే రుమాలు పరుచు కూర్చున్నాడు.

పెళ పెళా నవ్వింది సుధ.

'అనుకోని రెస్పాన్సు' వచ్చినందుకు ఐసయ్యాడు.

'మీరు రోజూ వస్తుంటారా ఇక్కడికి?' దగ్గరకు జరుగుతూ అడిగాడు.

'అబ్బె... ఎప్పుడో వస్తూంటాను' సుధ సమాధానం.

'భలేగా మాట్లాడతారు, మీ పేరు" తెలియనట్లు అడిగాడు.

'ఊఁ... అని తీక్షణంగ చూచి అంతలోనే ఏడుపు ముఖంపెట్టి, మళ్ళీ అనుకోకుండా నవ్వి 'మాధవి' అంది.

'అబద్ధమాడుతున్నారు'

'చచ్చేటంత నిజం మాట్లాడుతున్నాను. ఆఁ... మర్చిపోయాను. నా పేరు సుధ. ఏం? బావుందా?'

'ఎంతో బావుంది మంచి పేరూ. పేరుకుతగ్గ మీ మాటతీరు...'

'మరి... మీ పేరు?

'ఆనందం.'

'సదానందమా?'

'అరె... మీకెట్లా తెల్సింది నా పూర్తి పేరు?'

'నవ్వుతుంటేనూ... సదానందమేమో అనుకున్నాను.'

'మీరిక్కడికెందుకొస్తారు?'

'నీకోసం.'

'నేనొస్తానని మీకెట్లా తెలుసు?'

'నేను రోజూ వస్తున్నాగా.'

'రోజూ యెందుకొస్తున్నారు?'

'ఆనందంకోసం. అంటే... మీకోసం. చూడండీ... మీ రెవరినైనా ప్రేమించారా...'

సుధ ధోరణి చూచి బిత్తరపోతున్నాడు. కాని తత్తర పాటునుండి మేలుకొని 'మరి... మీరు...?' యెదురు ప్రశ్న వేశాడు గుండె చిక్కబట్టుకుని.

'మిమ్మల్నే ప్రేమిస్తున్నాను. ఏమండీ——నే అందంగా వున్నానా?' సదానందం ప్రక్కకు జరిగింది.

'మీకేం భేషుగ్గా వున్నారు. చందనపు బొమ్మల్లా వున్నారు.'

'ఇంకానయం దాసుగారి చేతిలో చిరతలావున్నా నన్లేదు.'

సుధ మాటలు అర్థంగాక విస్తుపోతున్నాడు సదానందం. మళ్ళీ అంతలోనే 'ప్రేమంటే యిలాగే వుంటుందేమో...' అనుకుని గట్టిగా గాలి పీల్చుకున్నాడు.

'ఏమండీ... సిగరెట్టుంటే ఇస్తారూ?' సుధ అడిగింది.

"అదేమిటండీ... ఆడవాళ్ళు సిగరెట్లు కాలుస్తారా?"

"మీరు పురాణ కాలంలో వాళ్ళా? ఇది అణు యుగం సార్! సిగరెట్టేమిటి... బ్రాందీకూడా తాగుతాను— మాడాడి ఫారినెళ్ళొచ్చాడు. నాకూ అదే అలవాటయింది. మా ఇంట్లో అందరిదీ ఫారన్ కల్చరే... లేకపోతే మాఫాదర్ వూరుకోడు" గడగడా మాట్లాడేసింది.

'అయ్యబాబోయ్-అయితే చాలా ఎడ్వాన్సు ప్రేమలో వున్నానుగామోసు' అనుకున్న సదానందం సుధ కళ్ళల్లోకి నిశితంగ చూశాడు.

'అబ్బ అట్లా చూడకండీ! మీ కళ్ళు నన్ను ప్రేమిస్తున్నయ్.'

"భలే... భలే..." అనుకున్న సదానందం సుధ చేతిని అమాంతం తన చేతిలో ఇముడ్చుకున్నాడు.

చెంప చెళ్ళుమంది.

సదానందం కంటిలో నీరు తొణికిసలాడింది.

పొంగివచ్చే దుఃఖాన్ని, ఆవేశాన్ని, ఆపుకుంటూ చిదానందం చెప్పిన చిట్కా వుపదేశాన్ని మనసులో మరోమారు ఆకళింపు చేసుకుని 'ఆడవాళ్ళు కరుకుగా వుంటేనేగాని, ప్రేమ వ్యవహారం పక్వానికిరాదు...గదండి?' అని సన్నివేశాన్ని సమర్థించబోయాడు అర్థానందంతో.

'బాగా దెబ్బతగిలిందా? క్షమించండి.'

'నో...నో...భలేవారండీ చెంపదెబ్బతో ప్రారంభమైతేనేగాని మన ప్రేమ రక్తికట్టదు' అదోలా నవ్వేడు.

'అదిసరే...మీ వయస్సెంత?' సూటిగ అడిగింది.

'యెందుకు?'

'ఒకే వయస్సులో వున్నామా లేదాని.''

''సుమారు...పాతికేళ్లుంటయ్!

''లాభంలేదు—నాకు నలభై యేళ్ళు—అంటే—నేను మీకు అమ్మలాంటిదాన్ని...అంతేనా?'

'అమ్మమ్మా...అలా అనకండి. ప్రేమకు వయస్సుతో పనేముంది. అయినా మీరు నన్ను యేడిపిస్తున్నారు. కదూ? కాకపోతే...పాలుగారే వయస్సులోవున్న మీకు నలభై యేళ్ళేమిటండి నాముఖం.'

'అయితే నేను యేడుస్తాను.'

'వద్దు సుధా! నువ్వేడిస్తే నే బ్రతకలేను. ఈ పరిస్థితుల్లో నువ్వూ నన్ను కాదంటే...సముద్రంలో దూకి చచ్చిపోతాను. అంతేగాని భగ్నప్రేమికుడిలా జీవించలేను.'

"చావన్నా... చచ్చి పోతాననే వాళ్ళన్నా... నాకు చచ్చే భయం—బాధ పడకండి మిమ్మల్నే ప్రేమిస్తాను సరేనా?!—" అనేసి సదానందంవడిలో తల వాల్చింది.

బాగా పొద్దు పోయింది.

ఆకాశంలో నక్షత్రాలు కిక్కిరిసినయి.

బీచిలో జనం పల్చబడ్డారు

'ఇక వెళ్దామా' సదానందం లేవబోయాడు.

'అంత తొందరేమిటీ-మాడాడీ కార్లోవస్తా డిప్పుడు. ముగ్గురం కలిసే వెడదాం వుండండి"

"అమ్మో! మీ నాన్నే?! —ఇంకేమైనావుందా ... అసలే పోలీసు ఇన్‌స్పెక్టర్!... పైగా నిన్ను ప్రేమిస్తున్నానని తెలిస్తే... డొక్క చించేయరూ—'

"మాడాడీ అలాంటి వారుగాదు... అదుగో మాట లోనే వచ్చేశారు"

ఆగిన ఫియట్ కార్లోనుంచి కరుణానిధి దిగివస్తూ "సుధా! ఇక వెళదామా!... ఇతనెవరు?..."

కాళ్ళూ చేతులు చల్లబడ్డయి సదానందానికి

"ఈయనొక పిచ్చివాడు ... కాదు ... పాపం మంచి వాడు."

"అలాగా!... నీకెట్లా తెల్సమ్మా!—"

"నన్ను ప్రేమిస్తున్నారు నాన్నా!—"

"అయితే ఇంకేం రావయ్యా అల్లుడూ—రా! మా ఇంటిదాకా కార్లోనే వెడదాం ..."

మాటలు వినేసరికి సదానందానికి వళ్ళంతా చెమటలు పట్టినయి—నోటమాట రాలేదు—అచేతనంగ బయల్దేరేడు.

హాల్లో సోఫాలో కూర్చోమని చెప్పి ఇంట్లో కెళ్ళారు సుధ, కరుణానిధి.

"తన పరిస్థితేమిటో అర్థమవలేదు సదానందానికి. ఒక వేళ కథ అడ్డం తిరిగితే... పీపు సాపవడమే కాకుండా అప్రతిష్ట పాలు కావల్సి వస్తుందేమోని' ఆందోళన పడసాగేడు.

గుండె వేగంగా కొట్టుకో నారంభించింది.

నౌకరు కాఫీ తెచ్చాడు.

మలేరియాజ్వరంతో వణుకుతున్న వాడల్లా కాఫీ కప్పు చేతిలోకి తీసుకుని వక్క గుక్కతో జుర్రేసేడు.

'అయ్యా! మీరు అమ్మాయిగారి క్రొత్త ప్రేమికులా?—' అడిగేడు.

అయోమయావస్థలో పడిన సదానందానికి అతగాడేసిన ప్రశ్న అర్థంగాక, 'కొత్త ప్రేమికుడంటే...' అడిగేడు.

"మరేంలేదు బాబూ ... సుధమ్మగారు ప్రేమించానంటూ రోజు కొకరిని వెంట తీసుకొస్తుంటారు ... అలాగే మీరూ వచ్చారా?"

"అంటె..."

"మీకు తెలవదా ... అమ్మాయిగారికి మతిస్థిరం లేదు."

"అంటే?—"

"అంటే... అదేనయ్యా... పిచ్చి."

"పి... చ్చా!"

"అవునండీ! ఏం మాట్లాడతారో ఆమెగారికే తెలీదు. ఆస్పత్రిలోకూడా చాలారోజు లున్నారు. చివరికి నయం గాదని చెప్పిపంపారు- అయితే బాబూ ఒక్కటి మాత్రం నిజం. సుధమ్మగారికి నచ్చినోరినిచ్చి వెంటనే పెళ్ళిచేస్తే ... నయమవుతుందని డాక్టర్లు చెప్పారు — పాపం! గ్రాచారం పిచ్చిపిల్లనేసి యెవ్వరూ చేసుకోవటంలేదు- అంచేతనే మీరే మైనా పెళ్ళి చేసుకోబోతున్నారాని" అనేసి ఇంట్లోకెళ్ళేడు.

అయోమయావస్థలోపడ్డ సదానందం "అయ్య బాబోయ్- పిచ్చి- ప్రేమ ప్రేమంటూ ... చివరకు పిచ్చి పిల్లను చూపించావుగదురా చిదానందం ... ఇంకా నయం ... కాళ్ళు చేతులూ కట్టేసి కరుణానిధి పిల్లమెళ్ళో తాళిగట్ట మన్నాడుగాడు" అనేసి కుర్చీలో కూర్చున్నవాడల్లా లేచి వక్క పరుగులో రోడ్డుమీదికొచ్చిన సదానందం, అర్థానం దంతో ఇంటిముఖం పట్టాడు.